క్లుప్తంగా

నేటి నుంచి యానాంలో క్రికెట్ టోర్నమెంట్

యానాం: పుదుచ్చేరి క్రికెట్ అసోసియేషన్ గుర్తింపు గల యానాం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్(వైడీసీఏ) ఆధ్వర్యంలో క్యాప్ టి 12 సూపర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్–2023 సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పంతగడ సుమన్ బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5వ తేదీ సోమవారం నుంచి మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ క్రికెట్ గ్రౌండ్‌లో తెలుపు రంగు బంతితో మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. నియోజకవర్గ పరిధిలోని 10 జట్లు టోర్నీలో ఆడతాయన్నారు. టోర్నీలో గ్రూప్–ఎలో అగ్నిలయన్స్, అంబేడ్కర్ ఎలెవెన్స్, కేవీఆర్, నాగా ఎలెవెన్స్, రామాయూత్–బి జట్లు ఉంటాయని, గ్రూప్–బీలో రామాయూత్, గ్లాడియేటర్స్, సీ సోల్జియర్స్, కేఎఫ్‌సీసీ, ఆర్‌వైసీ జట్లు ఉన్నాయన్నారు.

ఘనంగా చండీ హోమం

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి తిథిని పురస్కరించుకొని ఆదివారం ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, చండీ పారాయణ, చండీ హోమం, పూర్ణాహుతి అత్యంత వైభవంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా ధనమ్మ తల్లి తీర్థ మహోత్సవం


ప్రత్యేక అలంకరణలో ధనమ్మ తల్లి

తాళ్లరేవు: స్థానిక మాధవరాయునిపేట గ్రామదేవత ధనమ్మ తల్లి అమ్మవారి తీర్థమహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి అమ్మవారి జాతర సందర్భంగా గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ముత్యాలమ్మకు క్షీరాభిషేకం


ముత్యాలమ్మను దర్శించుకున్న భక్తులు

తాళ్లరేవు: జ్యేష్ఠ నక్షత్ర పౌర్ణమి పర్వదినం సందర్భంగా పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వరస్వామివారి ఆలయ అర్చకులు ఖండవిల్లి శ్రీకృష్ణమాచార్యులు అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక కుంకుమపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విళ్ల సత్యనారాయణ, విళ్ల వీర, ఉంగరాల వెంకటేశ్వరరావు, పితాని వీరబాబు, ధూళిపూడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలతో బాలల సమాజాన్ని ఆవిష్కరించాలి


అమలాపురంలో బాల వికాస్ గురువులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు

అమలాపురం టౌన్: సత్య సాయి సేవా సంస్థల ద్వారా జిల్లాలో జరుగుతున్న బాల వికాస కేంద్రాల ద్వారా నైతిక విలువలతో కూడిన బాలల సమాజాన్ని ఆవిష్కరించాలని జిల్లా సత్యసాయి సంస్థల కోఆర్డినేటర్ అడబాల కొండబాబు అన్నారు. స్థానిక శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో జిల్లాలోని 180 సత్య సాయి బాల వికాస్ కేంద్రాల గురువులకు ఆదివారం ఒక రోజు జరిగిన శిక్షణా కార్యక్రమానికి కొండబాబు అధ్యక్షత వహించి ప్రసంగించారు. బాల వికాస్ కేంద్రాల ద్వారా నీతి కథలు, నైతిక విలువలు, కుటుంబ బంధాలు, పురాణ గాథలు చెప్పడం వంటి చక్కటి విషయాలను చిన్నారులకు తెలియజేయాలని కొండబాబు సూచించారు. శిక్షణ తర్వాత బాల వికాస గురువులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో అమలాపురం జోన్ సత్య సాయి సేవా సంస్థల కోఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్, శిష్టా గుణ రంజన్, భవాని తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తనయుడి పరామర్శ

అమలాపురం రూరల్: ఆంధ్రా బ్యాంక్ విశ్రాంత ఉద్యోగి ఉబ్బన పద్మనాభరావు మృతి బాధాకరమని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. పద్మనాభరావు కుటుంబసభ్యులను జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్ గోపాల్, కౌన్సిలర్ నాగారపు వెంకటేశ్వరరావులతో కలిసి ఆదివారం ఆయన పరామర్శించారు. పద్మనాభరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మండే ఎండ.. అప్రమత్తతే అండ

- ఉష్ణ తాపానికి అల్లాడుతున్న జనం
- బయటకు రావాలంటేనే బెంబేలు
- తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్య నిపుణులు


ఎండ తీవ్రతకు ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలో నిర్మానుష్యమైన రహదారి

అల్లవరం: రోహిణి కార్తె మొదలైనప్పటి నుంచి ఎండలు మరింత పెరిగిపోయాయి. అధిక ఉష్ణోగ్రతలకు వేడిగాలులు తోడై జన జీవనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. నిత్యం అత్యధికంగా 38 డిగ్రీల నుంచి 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 7 గంటల నుంచే ఎండ తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం 11 గంటల సమయానికే దాదాపు షాపులన్నీ మూతపడుతున్నాయి. సాయంత్రం ఆరు గంటలకు కూడా ఉక్కబోత తగ్గడంలేదని వృద్ధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు, దీర్ఘకాలిక అనారోగ్యాలతో బాధపడేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వడదెబ్బ తగలకుండా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వేసవిలో అధిక ఉష్ణోగ్రతల వేళ బయట తిరిగితే వడదెబ్బకు గురయ్యే ప్రమాదముంటుంది. శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తి అయినా, లేదా శరీరం ఉష్ణాన్ని కోల్పోయినప్పుడు మనుషులు వడదెబ్బకు గురై చనిపోతుంటారు. ప్రధానంగా 40 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నప్పుడు, రోహిణి కార్తె సమయాల్లో వడదెబ్బ మరణాలు ఎక్కువగా చోటుచేసుకుంటుంటాయి. అందుకే ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రధానంగా భానుడి తన ప్రతాపాన్ని చూపిస్తున్న సమయంలో ఎక్కువగా శారీరక శ్రమతో కూడిన పనులు చేయకుండా ఉండడమే ఉత్తమం. అంతేకాదు పగటి పూట అత్యవసరమైతే తప్ప బయట తిరగకుండా ఉండడమే మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ముందు జాగ్రత్తలతోనే రక్షణ

- తప్పనిసరై ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే వడదెబ్బ నుంచి కాపాడుకోవడానికి తెల్లటి, కాటన్ వస్త్రాలు ధరించడంతో పాటు గొడుగు వాడడం మంచిది. తలకు ఎండ నుంచి రక్షణ కల్పించేందుకు టోపీ, ముఖానికి రుమాలు ధరించడం మేలు.
- ఎక్కువ సార్లు నీరు తాగడంతో పాటు నిమ్మరసం, కొబ్బరినీళ్లు, మజ్జిగ లాంటి ద్రవ పదార్థాలు తరచుగా తీసుకోవడం వల్ల వడదెబ్బ నుంచి ఉపశమనం పొందొచ్చు.
- ఎవరైనా వడదెబ్బకు గురైతే అతడిని ప్రాణాపాయం నుంచి కాపాడుకోవడానికి గాలి తగిలేలా నీడ ప్రదేశానికి తీసుకెళ్లి చల్లని నీటిలో ముంచిన గుడ్డతో శరీరం సాధారణ స్థాయికి వచ్చే వరకూ తుడుస్తూ ఉండాలి.
- వడదెబ్బ తగిలిన వ్యక్తికి ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణాన్ని తాగించాలి. అపస్మారక స్థితిలో ఉంటే మాత్రం రోగికి నీరు తాగించకూడదు. వీలైనంత త్వరగా ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స అందిస్తే వడదెబ్బకు నుంచి రోగిని కాపాడుకోవొచ్చు.

తరచుగా ద్రవ పదార్థాలు తీసుకోవాలి



ఎండల తీవ్రత నేపథ్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ శారీరక శ్రమతో కూడిన పనులు చేయకూడదు. తరచుగా నీరు, మజ్జిగ, కొబ్బరి బొండాలు తాగడం వల్ల అధిక ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం పొందొచ్చు. ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే డాక్టర్‌ని సంప్రదించి వైద్యం అందిస్తే ప్రాణాలు కాపాడొచ్చు.
– డాక్టర్ సుమ, గోడిలంక పీహెచ్‌సీ, అల్లవరం మండలం

వలంటీర్లు సంక్షేమ సారథులు


వలంటీర్లకు అవార్డు అందించి సత్కరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే పొన్నాడ

ముమ్మిడివరం: ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు అందించే సంక్షేమ సారథులు వలంటీర్లు అని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ శివారు మహిపాల్ చెరువు గ్రాండ్‌పార్క్‌లో ఆదివారం జరిగిన నగర పంచాయతీ, ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పార్టీల కతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను చేరవేస్తున్న వలంటీర్ల సేవలు మరువలేనివన్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు రావాలంటే జన్మభూమి కమిటీలు ప్రతిపాదించిన వారికే వచ్చేవన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎవరి ప్రమేయం లేకుండానే రేషన్ కార్డు దగ్గర నుంచి ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం అందించే స్వేచ్ఛను వలంటీర్లకు కల్పించారన్నారు. వారి పనితీరు ఆధారంగానే సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులకు ఎంపిక చేస్తున్నారన్నారు. సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా వలంటీర్లు తమకు దక్కిన గౌరవాన్ని సార్థకం చేసుకుని మరింత బాధ్యతగా పనిచేయాలన్నారు. నాలుగేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని మరో ఏడాది పాలనలో మరింత మంచి చేకూరుతుందని చెప్పారు. తొలుత ముమ్మిడివరం, కాట్రేనికోన మండలం, నగర పంచాయతీ పరిధిలో ఇద్దరికి సేవా వజ్ర, 15 మందికి సేవా రత్న, 732 మందికి సేవా మిత్ర అవార్డులు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోలా గంగాభవాని, జెడ్పీటీసీలు కుడిపూడి శంకరరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, నడింపల్లి సూరిబాబు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశిబాలమునికుమారి, నేల కిశోర్, కోలా బాబ్జి, మండల పార్టీ అధ్యక్షుడు జగతా పద్మనాభం, నల్లా నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


నగరంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: రెండు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుడి కాలు దెబ్బతిని స్టిక్ సహాయంతో నడుస్తూ ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న పి.గన్నవరం మండలం నరేంద్రపురానికి చెందిన మామిడిశెట్టి సాయియశ్వంత్ పరిస్థితిని చూసి చలించిన రాష్ట్ర సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మానవత్వం చూపారు. యశ్వంత్ పరిస్థితిని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సీఎం దృష్టికి తీసుకువెళ్లగానే ఆయన స్పందించి సీఎం సహాయ నిధి నుంచి రూ.5 లక్షలు ఆర్థికసాయం అందించారు. నగరంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు స్వగృహం వద్ద ఆదివారం జరిగిన సమావేశంలో ఈ చెక్కును ఎమ్మెల్యే చిట్టిబాబు లబ్ధిదారుని కుటుంబానికి అందజేశారు. దీంతో సహా సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన అయిదుగురికి రూ.6.85 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అప్పనపల్లికి చెందిన కామిశెట్టి రాజాకు రూ.35 వేలు, కడలి వెంకటేశ్వరరావుకు రూ.18 వేలు, పెదపట్నానికి చెందిన చెల్లుబోయిన కృష్ణకు రూ.18 వేలు, కోన సూర్యనారాయణకు రూ.60 వేలు చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.

ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభించాలి

ఎమ్మెల్యే అశోక్‌ను కోరిన కనకాలపేట గ్రామస్తులు


కనకాలపేట స్టేడియాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్ తదితరులు

యానాం: ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని కనకాలపేట గ్రామస్తులు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామిలను ఆదివారం కోరారు. స్థానిక కనకాలపేట కేపీవీఎస్ ప్రభుత్వ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం స్కూల్ ఆవరణలో ఉన్న ఇండోర్ స్టేడియం, పరిసర ప్రాంతాల దుస్థితిని ఎమ్మెల్యే అశోక్ అధికారులతో కలిసి పరిశీలించారు. స్టేడియం ఆవరణ చుట్టూ పిచ్చిమొక్కలు మొలవడమే కాకుండా పాములు సైతం వస్తున్నాయని స్థానిక యువకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్టేడియం నిర్మాణం పూర్తై ఏడాది గడుస్తున్నా ఎందుకు ప్రారంభించలేదని అక్కడే ఉన్న పీడబ్ల్యూడీ ఇంజినీరు నాగరాజును ప్రశ్నించారు. ఇండోర్ స్టేడియంలో సెంట్రల్ ఏసీ వేయడానికి టెండర్లు పిలవాల్సి ఉందని ఆయన బదులిచ్చారు. స్టేడియం తాళాలు వేసి ఉంచడానికి కాదని త్వరగా ప్రారంభించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కనకాలపేటలో తాగునీటి పైపులోకి డ్రెయిన్ వాటర్ వస్తుందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో అక్కడకు ఎమ్మెల్యే అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామి వెళ్లి పరిశీలించారు. సమస్యను పరిష్కరించేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అశోక్ అధికారులకు ఆదేశాలిచ్చారు.

మూడు నెలలకోసారి ఉచిత వైద్య శిబిరాలు


ఉచిత కంటి వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్ తదితరులు

యానాం: నియోజకవర్గంలో ప్రతి మూడు నెలలకోసారి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. ఆదివారం కనకాలపేట గ్రామంలో ఓఎన్‌జీసీ ఈస్టర్న్ ఎసెట్ కాకినాడ, లయన్స్‌క్లబ్ పిల్లారాయ, పరమహంస యోగానంద నేత్రాలయ, ఇనోదయ ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో 396 మందికి కంటి వైద్యపరీక్షలు నిర్వహించి 50 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. 210 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి పేదవాడికి కనీస వైద్యం అందాల్సిన ఆవశ్యకత ఉందని, ఉచిత వైద్య శిబిరాల ద్వారా వైద్యాన్ని మారుమూల గ్రామాలకు విస్తరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, సీఐ షణ్ముగం, విద్యుత్ ఏఈ లంక కృష్ణారావు, జీజీహెచ్ ఏడీ పలాస్‌కుమార్ పాన్యాల్, లయన్స్ అధ్యక్షుడు పులవర్తి శ్రీను, పీడబ్ల్యూడీ ఏఈ నాగరాజు, బీజేపీ అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

కవిత్వం సామాజిక ప్రయోజనం చేకూర్చాలి


సభలో మాట్లాడుతున్న ర్యాలి శ్రీనివాస్ తదితరులు

ముమ్మిడివరం: కవిత్వ రచన సామాజిక ప్రయోజనాన్ని కలగజేసేదిగా ఉండాలని గోదావరి కవి, సాహితీ గోదావరి సంస్థ అధ్యకుడు డాక్టర్ ర్యాలి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కొత్తలంకలో కవిత్వ ప్రయోజనం–కవుల పాత్ర అనే అంశంపై జరిగిన వర్క్ షాప్‌లో ఆయన ప్రసంగించారు. కవిత్వ రచనకు ఎంచుకునే అంశం దగ్గర నుంచి భిన్నత్వాన్ని కలిగి ఉండాలని చెప్పారు. కోవిడ్ అనంతరం కవులు తమ రచనల్లో సామాజిక ఇతివృత్తాలను ఎక్కువగా ఎంచుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో 20 మంది కవులు సమకాలీన అంశాలతో కూడిన కవితలు వినిపించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్.సూర్యభాస్కరం, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం గొర్రెల ఉదయ భాస్కర రావు, వారణాసి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఎమ్మెల్సీ కుడుపూడి



అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన ఈ పట్టణానికి చెందిన కుడుపూడి సూర్యనారాయణ రావు వ్యవహరించనున్నారు. మున్సిపల్ కౌన్సిల్‌లో ఎక్స్ అఫీసియో సభ్యునిగా ఉండేందుకు ఎమ్మెల్సీ కుడుపూడి తన అంగీకారాన్ని తెలుపుతూ మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడికి శనివారం దరఖాస్తు పంపారు. ఎక్స్ అఫీషియో సభ్యునిగా కుడుపూడి నియామకం లాంఛనంగా పూర్తయినట్లే. ఇప్పటికే ఈ మున్సిపాలిటీకి ఎక్స్ అఫీషియో సభ్యులుగా స్థానిక ఎమ్మెల్యేగా మంత్రి పినిపే విశ్వరూప్, అమలాపురం ఎంపీ చింతా అనురాధ వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు ఎమ్మెల్సీ కుడుపూడి చేరికతో మున్సిపాలిటీ పాలక పక్షానికి ఎక్స్ ఆఫీషియో సభ్యుల సంఖ్య ముగ్గురికి పెరగనుంది. ఇకపై ఎమ్మెల్సీ కుడుపూడి మున్సిపల్ సమావేశాలకు హాజరయ్యే అధికారం, అవకాశం వచ్చినట్టింది.

ఉచిత మెగా వైద్య శిబిరం


సావిత్రినగర్‌లో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరం

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు 60వ పుట్టినరోజును పురస్కరించుకుని ఆదివారం సావిత్రినగర్ యువత అధ్యక్షుడు మల్లాడిరాజు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఈసీజీ, షుగర్ తదితర వైద్య పరీక్షలతో పాటు కంటి వైద్య పరీక్షలు సైతం చేశారు. అపోలో వైద్యులు, ఎల్‌వీ ప్రసాద్ కంటి హాస్పటల్ నిపుణులు, సూర్యమల్టీ స్పెషాలిటీ వైద్యులు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, ఎన్‌ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిడ్ల చంద్రరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ పెండెం సూర్యప్రకాష్, విశ్రాంత సీఐ శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

కుడుపూడికి సత్కారం


ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణను సత్కరిస్తున్న మాధవరాయునిపేట గ్రామస్తులు

తాళ్లరేవు: ముమ్మిడివరం మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణను తాళ్లరేవు మాధవరాయునిపేట గ్రామస్తులు ఆదివారం ఘనంగా సత్కరించారు. స్థానిక ధనమ్మ తల్లి అమ్మవారి తీర్థ మహోత్సవాల సందర్భంగా గ్రామానికి విచ్చేసిన శివన్నారాయణను ఆలయ నిర్వాహకులు దుశ్శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం శివన్నారాయణ ధనమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఐఏఎల్ జాతీయ కార్యవర్గ సభ్యునిగా ఆజామ్


ఎండీ ఆజామ్

అమలాపురం టౌన్: ఇండియన్ అసోసియేషన్ లాయర్స్(ఐఏఎల్) జాతీయ కార్యవర్గ సభ్యునిగా అమలాపురం పట్టణానికి చెందిన క్రిమినల్ లాయర్ ఎండీ ఆజామ్ ఎన్నికయ్యారు. కేరళ రాష్ట్రం త్రివేండ్రమ్‌లో ఈ నెల 2, 3, 4 తేదీల్లో జరిగిన ఐఏఎల్ నేషనల్ కాన్ఫరెన్స్‌కు ఎండీ ఆజామ్‌తో పాటు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి పలువురు సీనియర్ న్యాయవాదులు హాజరయ్యారు. 4వ తేదీన ఐఏఎల్‌కు జాతీయ స్థాయిలో జరిగిన ఎన్నికల్లో జాతీయ కార్యవర్గ సభ్యునిగా ఎండీ ఆజామ్‌ను ఎంపిక చేశారు. జిల్లాకు చెందిన పలువురి సీనియర్ న్యాయవాదులతో పాటు అమలాపురం బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఎండీ ఆజామ్ ఎన్నికపై హర్షం వ్యక్తం చేశారు.

వ్యాపారస్తులతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్ కుమార్

అమలాపురం రూరల్: అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని వ్యాపారస్తులతో బీజేపీ నాయకులు సమావేశమయ్యారు. ఆదివారం అమలాపురం ప్రెస్ క్లబ్ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ మాట్లాడుతూ ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో విజయాల గురించి వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు, అయ్యాల బాషా, అడబాల సత్యనారాయణ, వల్లభనేని రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

మామిడికుదురు: స్థానిక అంబేడ్కర్ సామాజిక భవనంలో జనసేన ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ రాపాక రమేష్‌బాబు ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, పార్టీ నేతలు రుద్రా శ్రీను, ఈలి రాంబాబు, మట్టా సత్తిబాబు, యింటి మహేంద్ర పాల్గొన్నారు.

ఆ ఇల్లు.. పచ్చని పొదరిల్లు

- ఆదర్శంగా అంగన్‌వాడీ టీచర్ రాణి కుటుంబం
- ఇంటి ప్రాంగణంలో పూలు, కూరగాయలు, పండ్ల మొక్కల పెంపకం
- నేడు పర్యావరణ దినోత్సవం


రాణి ఇంటి ఆవరణలోని పూల తోట


ఇంటి ఆవరణలోనే ఖాళీ వాటర్ టిన్నుల్లో మొక్కల పెంపకం

అమలాపురం టౌన్: ఆ ఇల్లు పచ్చని పొదరిల్లు... పక్షుల కిలకిలరావాలు.. ఔషధ మొక్కల గాలి తెరలు.. పూల మొక్కల గుబాళింపులు.. సేంద్రియ ఎరువులతో కూరగాయలు.. భిన్నరసాల రుచుల పండ్లు.. ఇలా మొత్తంగా ఆ కుటుంబం పర్యావరణ హిత జీవనశైలిని ఆచరిస్తుంది.

అమలాపురం పట్టణం సూర్యనారాయణపేటలో ఓ అద్దె ఇంట్లో ఉంటున్న అంగన్‌వాడీ టీచర్ రాణి కుటుంబం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. మూడు సెంట్ల ఖాళీ స్థలంలో రాణి తన భర్త హోంగార్డు శ్రీనివాసరాజు, కుమార్తె జాహ్నవి ఐశ్వర్య, కుమారుడు వేణుగోపాలవర్మల సహకారంతో రకరకాల మొక్కలను నింపేశారు. సోమవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ రాణి కుటుంబం ప్రారంభించిన పచ్చని ప్రస్థానంపై ప్రత్యేక కథనం..

ఆరోగ్యం.. పర్యావరణ స్ఫూర్తితో..

మూడేళ్ల క్రితం కరోనా సమయంలో ఇంటికి పరిమితమైన రాణి కుటుంబ సభ్యులు ఇంటి ఆవరణలో మొక్కలు పెంచడాన్ని మొదలు పెట్టారు. వంకాయ, బెండ, బీర, చిక్కుడు, పొట్ల, దొండ, మునగ, మిరప తదితర రకాల కూరగాయలతో పాటు ఆకు కూరలను కూడా సాగు చేస్తున్నారు. బత్తాయి, నారింజ, మామిడి, స్టార్ ఫ్రూట్ తదితర పండ్ల మొక్కలతో పాటు ఔషధ గుణాలున్న మారేడు, ఉసిరి, అంజీర, వేప, నిమ్మ తదితర మొక్కలను పెంచుతున్నారు. వారి ఇంటి ఆవరణలో దాదాపు 200 రకాల పూలు, పండ్లు, కూరగాయలు, ఔషధ మొక్కలు పెరుగుతున్నాయంటే ఆ ఇల్లు పచ్చని పొదరిల్లు కాకపోతే ఏమవుతుంది. ఇంట్లో వచ్చే తడిచెత్తను ఇంటి ఆవరణలోనే కంపోస్టు చేసి సేంద్రియ ఎరువుగా మార్చి మొక్కలన్నింటికీ వేస్తున్నారు.

ఖాళీ ప్లాస్టిక్ డబ్బాలే కూజాలుగా

తన ఇంటి ఆవరణలో ఉన్న కొద్దిపాటి స్థలంలోనే చాలా మొక్కలు పెంచుతున్నారు. ప్రధానంగా నేల అవసరం లేకుండానే పాడైన ఖాళీ వాటర్‌టిన్‌లు సేకరించి వాటిలో మట్టిపోసి మొక్కలను పెంచుతున్నారు. ఆ ఇంట్లో దాదాపు 100కి పైగా మొక్కలు వాటర్ టిన్నుల్లోనే దర్శనమిస్తాయి. ఇంటి ఆవరణలో పచ్చని చిలుకలకు కొలువుగా ధాన్యం కుచ్చులు కూడా వేలాడుతుంటాయి.

ఆరోగ్యం విలువ తెలుసుకుని



కరోనా తర్వాత మాకు ఆరోగ్యం విలువ తెలిసింది. అప్పటి నుంచి సేంద్రియ ఎరువులతో పెరిగిన కలుషితం లేని ఆహారాన్ని భుజించాలనుకున్నాం. అందుకే మేము అద్దె ఇంట్లో ఉంటున్నా ఉన్న స్థలంలోనే ఔషధ, పూల, పండ్లు, కూరగాయల మొక్కలను పెంచుతున్నాం. మా ఇంట్లో దాదాపు కూరగాయలు, పండ్లు మేము పండించినవే వాడతాం. – రాణి, జాహ్నవి ఐశ్వర్య, తల్లీకూతుళ్లు, అమలాపురం